

రాష్ట్ర ఉత్సవంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

పలాస, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఏటా ఆగస్టు 16న రాష్ట్ర ఉత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అన్ని సచివాలయాలు, జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని ఉత్సవంగా జరపాలని, వారికి కేటాయించిన బడ్జెట్ నుంచి నిధులను ఖర్చులకు వినియోగించాలని ఆదేశించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమైన వేదిక

జెండా పండుగకు వేళాయే

- పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం
- శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు
- జాతీయజెండాను ఆవిష్కరించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- 169 మందికి ఉత్తమ ప్రశంసాపత్రాలు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ప్రారంభం

శ్రీకాకుళం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా.. శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ప్రాంగణం, పోలీసుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు.. ప్రభుత్వ పనితీరు తెలిపే శకటాల ప్రదర్శన.. సందర్శకులు.. జిల్లా ప్రజలు తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా కాస్త ఇబ్బందులు (మిగతా 8వ పేజీలో..)

● నేడు రామ్ మిర్యాల ఆధ్వర్యంలో పాటల మధురిమ..

జిల్లా వజ్రోత్సవాల్లో భాగంగా.. రెండోరోజు గురువారం ఎన్టీఆర్ మైదానంలో కర్రసాము, సంగిడి రాళ్లు ఎత్తివేత.. ఇతరత్రా క్రీడాపోటీలను నిర్వహించారు. డ్వామా పీడీ పోటీలను ప్రారంభించారు. ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వజ్రోత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రముఖ సినీగాయకుడు రామ్ మిర్యాల ఆధ్వర్యంలో పాటల మధురిమ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం భారీగా నిర్వహించేలా ముమ్మర ప్రచారం చేశారు. అలాగే జిల్లాకేంద్రంలో విద్యుత్ దీపాల అలంకరణతో ప్రత్యేకత సంతరించుకుంది.

ఉత్సాహంగా గ్రామీణ క్రీడల పోటీలు

- విజేతలకు డీఎస్‌డీవో బహుమతుల ప్రదానం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాస్థాయి గ్రామీణ క్రీడల పోటీలు స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం ఉత్సాహంగా జరిగాయి. కర్రసాము, సంగిడీల తీత, పిల్లిమొగ్గలు, గూటాల తిప్పుట, ఉలవల బస్తా ఎత్తుట వంటి పోటీలలో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకరరావు, డీఎస్‌డీవో కె.శ్రీధర్, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి డి.మధుసూదనరావు, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, క్రీడా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

కర్రసాము పోటీలు పురుషుల విభాగంలో.. బి.ఖగేశ్వరరావు(ప్రథమ), ఏ.పాపారావు(ద్వితీయ), సీహెచ్.శంకరరావు(తృతీయ), సీనియర్ బాలుర విభాగంలో బి.ఖగేశ్వరరావు (ప్రథమ), ఏ.పాపారావు(ద్వితీయ), (మిగతా 8వ పేజీలో..)


కర్రసాము పోటీలో యువతుల విన్యాసం


ఉలవల బస్తా, సంగిడీ, గూటాల పోటీ


పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

పరేడ్‌ను విజయవంతం చేయాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా పోలీసు పరేడ్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సాయుధ బలగాలకు సూచించారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం ముందస్తు పరేడ్ నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ శేషాద్రి పరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ.. పోలీసు కవాతు సాధన నిర్వహించారు. రిహార్సల్‌లో భాగంగా ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. మైదానంలో వీఐపీలు, ఇతరుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ భద్రత బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు సి.హెచ్. వివేకా నంద, శేషాద్రి, సీఐ ఈశ్వరరావు, ఆర్ఐ కె.నరసింగరావు, శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సనలేని చరిత్ర.. సిక్కోలు ఘనత

- మహాత్ముడి నడిచిన నేల
- ఎందరో వీరులను కన్నభూమి
- ఉద్యమాల గడ్డగా శ్రీకాకుళం
- నేడు జిల్లా ఆవిర్భావ దినోత్సవం

నాటి గురుతులు
- జాతీయోద్యమంలో మరుపురాని ఘటనలు 8లో





మహాత్మా గాంధీ


శ్రీకాకుళం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): క్రీస్తు శకం 1948లో జమీందారీ వ్యవస్థను రద్దుచేసిన తర్వాత ఇచ్ఛాపురం, పార్వతీపురం, విజయనగరం సంస్థానాలన్నీ కలిపి విశాఖపట్నం అతిపెద్ద జిల్లాగా ఏర్పడింది. విశాఖ జిల్లా పెద్దదవడంతో పరిపాలనా పరమైన చిక్కులు ఏర్పడ్డాయి. దీనితో 1950 ఆగస్టు 15న శ్రీకాకుళం జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పట్లో షేక్‌అహ్మద్‌ను జిల్లాకు తొలి కలెక్టర్‌గా నియమించారు. జిల్లా ఏర్పడి నేటికి 75 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిక్కోలు ప్రాముఖ్యత, స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లావాసుల పాత్ర, వివిధ రంగాల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన ప్రముఖుల చరిత్ర గురించి తెలుసుకుందాం.

● కలం వీరుల కన్న భూమి..

ఎందరో కలం వీరులకు జన్మనిచ్చి జిల్లా పునీతమైంది. ఆచంట వెంకట సౌఖ్యాయన శర్మత.. తెలుగు పత్రికా రంగానికి శ్రీకారం చుట్టారు. 1881లో సుజాత ప్రమోదిని అనే పత్రికను, 1903లో కల్పలత అనే పత్రికను నెలకొల్పారు. పలు విజ్ఞాన అంశాలను ఆ పత్రికల్లో ప్రచురించేవారు. 1904లో రాజమండ్రి నుంచి వెలువడిన 'ఆంధ్రకేసరి' పత్రికా సంపాదకులు డా.చిలకూరి నారాయణరావు శ్రీకాకుళం జిల్లా వారే. వ్యవహార భాషోద్యమ పిడుగు 'గిడుగు వెంకట రామమూర్తి' ఈ జిల్లాలోని పర్వతాలపేట అగ్రహారానికి చెందినవారే. ఆయన 'తెలుగు' పత్రికను ఏడాదిపాటే నడిపినా.. దానిని వ్యవహారిక భాషోద్యమ దీపికగా మలిచారు. సవర భాషకు లిపిని, నిఘంటువును, వ్యాకరణాన్ని రూపొందించి భాషా వేత్తగా, శ్రీముఖలింగం ఆలయ శాసనాలను వెలుగులోకి తెచ్చిన శాసన పరిశోధకుడిగా రామ్మూర్తి పంతులు చరితార్థుడు. తెలుగుకు, ఒరియాకు భిన్నమైన సవరభాషను ఆయన నేర్చుకుని.. 'ఫొనెటిక్స్' లిపిని కనుగొన్నారు. ఆతర్వాత బ్రిటీష్ ప్రభుత్వం రామ్మూర్తి ఫొనెటిక్ లిపిని ఆమోదించింది. 1933లో ఇంగ్లీషు నిఘంటువును గిడుగు రామ్మూర్తి, ఆయన కుమారుడు సీతాపతి రూపొందించారు. సీతాపతి కూడా తండ్రి అడుగు జాడల్లోని (మిగతా 8వ పేజీలో..)


గిడుగు వెంకట రామమూర్తి


గరిమెళ్ల సత్యనారాయణ


కోడి రామ్మూర్తి నాయుడు


కరణం మల్లీశ్వరి

మహాత్ముడి నడిచిన నేల..

బ్రిటీష్ సామ్రాజ్యంపై అహింసే ఆయుధంగా పోరాడిన మహాత్మాగాంధీజీ.. స్వాతంత్ర్య పోరాటం తీరుతెన్నులు తెలుసుకునేందుకు 1927 డిసెంబరు 2న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. అప్పట్లో మూడు రోజులు ఇక్కడ గడిపారు. తొలిరోజున పాలకొండ రోడ్డులోని ఎంబాడ హనుమంతురావు ఇంట్లో బస చేశారు. ప్రస్తుతం ఈ ఇంటిని గాంధీజీ బస చేసిన చిహ్నంగా ఉంచేశారు. తర్వాత ఖాదీ పరిశ్రమ అభివృద్ధి తీరుతెన్నులు కూడా అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నేసిన ఖద్దరు పరిశీలించి నేత కార్మికులను ప్రశంసించారు. అదేరోజు మున్సిపల్ గ్రౌండ్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. దేశ సార్వభౌమాధికారం కోసం జరుగుతున్న పోరాటాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు వీలుగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడంతో గాంధీజీ వారిని అభినందించారు.


పొందూరు ఖాదీ (ఫైల్)


ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, కూటమి శ్రేణులు

ఆర్థిక ఇబ్బందులున్నా.. హామీలు నెరవేరుస్తున్నాం

- వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- 150 ట్రాక్టర్లతో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ

సంతబొమ్మాళి/ కోటబొమ్మాళి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో జగన్ ఆర్థిక విధ్వంసం సృష్టించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగిస్తున్నా'మని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం తొలివిడతగా రైతుల ఖాతాల్లో రూ.7 వేలు చొప్పున నిధులు జమచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతగా గురువారం మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో రైతులు, కూటమి నేతలు, కార్యకర్తలు సుమారు 150 ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. సంతబొమ్మాళి మండలం పాలేశ్వరస్వామి ఆలయం నుంచి కోటబొమ్మాళిలోని కొత్తపేట మీదుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు (మిగతా 8వ పేజీలో..)

భయపెడుతున్న.. భల్లూకాలు

- కోటబొమ్మాళి మండలంలో ఎలుగుల సంచారం
- ఆందోళన చెందుతున్న ప్రజలు

కోటబొమ్మాళి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలంలో ఎలుగుబంట్లు (భల్లూకాలు) సంచారంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా చలమయ్యపేట, తర్లిపేట, నారాయణపురం, బమ్మి డిపేట గ్రామాల పరిధిలోని తోటలు, పొలాల్లో ఎలుగులు సంచరిస్తున్నారని పేర్కొంటున్నారు. బుధవారం చలమయ్య పేటలోని ఓ వ్యవసాయ నేలబావిలో రెండు ఎలుగుబంట్లు పడిపోయాయి. గ్రామస్థులు గుర్తించి టెక్కలిలోని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. టెక్కలి అటవీరేంజ్ అధికారి జగదీశ్వరరావు, సబ్ డీఎఫ్‌వో నాగేంద్రరావు, సిబ్బంది రాత్రి 10 గంటలవరకు శ్రమించి వాటిని బయటకు తీశారు. అవి బావి నుంచి బయటకు వచ్చిన వెంటనే పక్కనే ఉన్న తోటల్లోకి పారిపోవడంతో బాక్సుల్లో బంధించలేకపోయారు. అలాగే గురువారం పొలం పనులకు వెళ్తుండగా నారాయణపురం వద్ద తోటలో ఓ ఎలుగుబంటి కనిపించిందని బమ్మిడిపేటకు చెందిన సూర్యారావు తెలిపారు. ఎలుగుబంట్లు ఏ సమయంలో తమపై దాడి చేస్తాయోనని భయంగా ఉందని స్థానికులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.


నారాయణపురం వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

విద్యుత్ సమస్య పరిష్కారానికి హెల్ప్‌డెస్క్‌లు

పాత శ్రీకాకుళం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఈనెల 17 వరకు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగవచ్చని వెల్లడించారు. 'జిల్లా విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశాం. శ్రీకాకుళం డివిజన్ - 94906 10045, టెక్కలి డివిజన్ - 83328 43546, పాతపట్నం - 73825 85630 నెంబర్లలో సంప్రదించాలి. శ్రీకాకుళం సర్కిల్ హెల్ప్ డెస్క్ 94906 12633, టోల్‌ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించవచ్చు. విద్యుత్ సరఫరాలో లోపాలు, పడిపోయిన వైర్లు, స్తంభాలు కనిపిస్తే.. వెంటనే ప్రజలు సమాచారం అందించాలి. సత్వరమే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపడతాం. తడిగా ఉన్న స్తంభాలను, వేలాడుతున్న వైర్లను పట్టుకోరాదు' అని కృష్ణమూర్తి స్పష్టం చేశారు.

నిద్రమాత్రలు ఇచ్చి.. చంపేశారు
- భర్తను హత్య చేసిన మహిళ
- సహకరించిన ప్రియుడు, మరొకరు అరెస్టు
10లో

ఇన్నాళ్ల సేవలకు ప్రతిఫలం ఇదేనా?
- వేతన బకాయిలూ లేవు..ఉద్యోగాలూ లేవు
- ఇదీ ఉద్దానం పథకం పంప్‌హౌస్ సిబ్బంది దుస్థితి
9లో

నకిలీ దివ్యాంగుల లెక్కతేలింది
- జిల్లాలో 40 శాతం మేర అనర్హులే!
- సచివాలయాల్లో జాబితాలు
8లో

భూగర్భ జలాల పెంపుపై దృష్టి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
9లో

నాటి గురుతులు

● జాతీయోద్యమంలో మరుపురాని ఘటనలు ● గ్రామాల్లో నేటికీ ఆనాటి జ్ఞాపకాలు ఎన్నో

స్వాతంత్ర్య ఉద్యమం గురుతులు కొన్ని నేటికీ పదిలంగా ఉన్నాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి నాటి యోధుల పోరాటానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. సారవకోటలో మహాత్మాగాంధీ బస చేసిన భవనం.. హరిపురంలో ఉద్యమ నాయకజలకు నీడనిచ్చిన భవనం.. ఇలా ఎన్నో చరిత్ర సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కొన్ని గురుతులు..


దూసి రైల్వేస్టేషన్‌కు వచ్చినప్పుడు గాంధీజీ



గాంధీజీ అడుగు పెట్టిన నేల..

ఆమదాలవలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం దూసి రైల్వేస్టేషన్‌లో 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో మహాత్మా గాంధీజీ అడుగు పెట్టారు. ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ రైలులో ప్ర యాణించారు. దీనిలో భాగంగా దూసి రైల్వే స్టేషన్‌లో దిగి సుమా రు 15 నిమిషాల పాటు ప్రసంగించారు. బ్రిటిష్ పరిపాలనను ఏవిధంగా తిప్పికొట్టాలో ప్రజల్లో అవగాహన కల్పించారు. దూసి రైల్వేస్టేషన్ ఆవరణలోనే గాంధీజీ మర్రి మొక్కను నాటారు. అప్పుడు నాటిన మొక్క మహా వృక్షమై రెండు ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. దూసి రైల్వేస్టేషన్‌లో గాంధీజీ అడుగుపెట్టినందున అప్పట్లో గాంధీ రైల్వేస్టేషన్‌గా దీనికి పేరు పెట్టాలని అనుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.


నాడు గాంధీజీ నాటిన మర్రి మొక్క నేడు మహావృక్షం


నరసన్నపేట సంతకు వెళ్లే మార్గంలో గల గాంధీ గెస్ట్‌హౌస్ ఇదే..

గాంధీ కోసం గెస్ట్‌హౌస్..

నరసన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా చేపడుతున్న ఉద్యమాల్లో అత్యంత ప్రభావితం చేసినది ఉప్పు సత్యాగ్రహం. అసమయంలో గాంధీజీ ఉప్పుపై పన్ను రద్దు చేయాలని యావత్ దేశం తిరుగుతూ నౌపడకు వచ్చారు. అప్పుడు తిలారు రైల్వేస్టేషన్ నుంచి నరసన్నపేట వస్తారని 1930లో అప్పటి స్వాతంత్ర్య సమరయోధుడు పొట్నూరు స్వామిబాబు ఓ భవనాన్ని నిర్మించారు. అయి తే గాంధీ నేరుగా నౌపడకు వెళ్లి నరసన్నపేటకు రాలేకపోయారు. అ భవనం ఇప్పటికీ గాంధీ గెస్ట్‌హౌస్‌గా పిలుస్తారు. ఈభవనంలోనే రాష్ట్రపతులుగా పనిచేసిన బాబు రాజేంద్రప్రసాద్, వీవీ గిరి విశ్రాంతి తీసుకున్నారు.

పెంటూరులో శిథిలావస్థకు చేరిన కృష్ణమూర్తినాయుడు ఇల్లు





శిథిలావస్థలో సమరయోధుని గృహం..

నందిగాం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెంటూరులో స్వాతంత్ర్య సమరయోధుడు అట్టాడ కృష్ణమూర్తినాయుడు స్వగృహం శిథిలావస్థలో దర్శనమిస్తోంది. అట్టాడ కృష్ణమూర్తినాయుడు ఇనాందార్ కుటుంబంలో జన్మించినప్పటికీ బాల్యం నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ఏడో తరగతితో చదువుకు స్వస్తిపలికి స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యమయ్యారు. పుల్లెల శ్యామసుందరరావు, పొట్నూరు సోంబాబు తదితరులకు ఈయన సమకాలీకుడు. క్విట్‌ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. భారత ప్రభుత్వం ఇచ్చిన పింఛను, భూమి, ఇతర ప్రయోజనాలను తిరస్కరించారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో పదవులను ఆయన అధిష్ఠించారు. 1977లో ఆయన కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన కుటుంబానికి సంబంధించి మూడో తరం వారసులు ఉన్నారు. పెంటూరులో ఉన్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. అప్పుడప్పుడు మనవడు అట్టాడ రవిబాబ్జీ శ్రీకాకుళం నుంచి వస్తూ పోతుంటారు.

ఉద్యమ నేతలకు నీడనిచ్చిన భవనం..


బ్రిటిష్ కాలం నాటి భవనం(నాడు)

హరిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం నడిబొడ్డున బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవంతి ఇది. ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు.. రైతాంగ విప్లవ వీరులకు వేదిక ఈ భవనం. ప్రస్తుతం శిథిలమై.. పైకప్పు పెంకులు రాలిపోయి నిరుపయోగంగా... గత చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. పలాసలో జరిగిన కిసాన్ మహాసభల నుంచి సర్దార్ గౌతు లచ్చన్న, ఎన్‌జీ రంగా, వావిలాల గోపాలకృష్ణయ్య, గోపరాజు రామచంద్రరావులతో పాటు ఎందరో ప్రముఖులు ఇక్కడి నుంచే తమ కార్యకలాపాలు సాగించారు. స్వాతంత్ర్యం వచ్చాక నాటి రాష్ట్రపతి వీవీగిరి బస చేసిన భవనమిది. పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి ప్రాంతాలకు వచ్చే అలనాటి నాయకులు ఈ భవనంలోనే సేదతీరే వారు. ఉప్పు సత్యాగ్రహం పాల్గొన్న నాయకులకు ఈ భవనమే అతిథ్యం అందించింది. దీంతో పాటు స్థానికంగా జమిందారీ పోరాటాలు, రైతాంగ విప్లవాలు చేపట్టిన వీరగున్నమ్మ, మార్పు పద్మనాభం వంటి మహానాయకులు ఈ భవనాన్ని వినియోగించారు. అనంతరం దీన్ని బ్రిటిష్ అధికారులు స్వాధీనం చేసుకొని పాలనా విభాగం నిర్వహించారు. పదేళ్ల కిందట దీనికి మరమ్మతులు చేపట్టి.. ఎందుకనో అర్థాంతరంగా నిలిపేశారు. ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఈ భవనాన్ని నాటి స్మృతులకు చిహ్నంగా దాచుకునే ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


మరమ్మతుల అనంతరం ఇలా (నేడు)

మహాత్మాగాంధీ విడిది చేశారని..


సారవకోటలో మహాత్మాగాంధీ బసచేసిన స్మారక గ్రంథాలయం

జలుమూరు (సారవకోట), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నంగా సారవకోటలో మహాత్మాగాంధీ స్మారక భవనం ఉంది. మహాత్మాగాంధీ నరసన్నపేట నుంచి మెళియాపుట్టి వెళుతూ మధ్యలో సారవకోటలో రాత్రి బస చేశారు. మహాత్మాగాంధీ రాత్రి బస చేసిన స్థలంలో ప్రభుత్వం పక్కా భవనం నిర్మించి స్థానికంగా ఉన్న గ్రంథాలయాన్ని ఆ భవనంలోకి మార్చి మహాత్మాగాంధీ స్మారక భవనంగా పేరు పెట్టింది. స్వాతంత్ర్య సమరంలో భాగంగా పొందూరు వచ్చిన మహాత్మాగాంధీ స్థానికుడైన స్వామిబాబు ఆహ్వానం మేరకు నరసన్నపేట వచ్చారు. ఇక్కడి నుంచి మెళియాపుట్టి వెళుతూ బోయిన అప్పలస్వామి ఆహ్వానం మేరకు సారవకోటలో 1927 డిసెంబరు 3న రాత్రి బస చేశారు. బోయిన అప్పలస్వామి జాతిపిత గాంధీజీకి అల్పాహారం అందించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో 1990లో ఎంపీపీగా పనిచేసిన చిన్నాల కృష్ణారావు కృషితో కొత్త భవనం నిర్మించారు. 1991 జనవరి 30న నాటి మంత్రి పి.సాంబశివరాజు ప్రారంభించారు. అనంతరం స్థానికంగా నిర్వహించే శాఖా గ్రంథాలయాన్ని ఈ భవనంలోకి మార్చి మహాత్మాగాంధీ స్మారక గ్రంథాలయంగా పేరు పెట్టారు. ప్రస్తుతం ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీనికి మరమ్మతులు చేసి భావితరాలకు జ్ఞాపకాలను అందించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సంగ్రామంలో ఎస్ఎంపురమూ కీలకమే..


చౌదరి సత్యనారాయణ


చౌదరి సత్యనారాయణ నివసించిన ఇళ్లు

ఎచ్చెర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో ఎస్ఎంపురం (షేర్‌మహమ్మద్‌పురం) కీలక గ్రామంగానే గుర్తింపు పొందింది. ఈ గ్రామానికి చెందిన చౌదరి సత్యనారాయణ.. గౌతు లచ్చన్న అనుచరునిగా ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. ఈ ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో చౌదరి సత్యనారాయణ ప్రధాన పాత్ర పోషించారు. ఆయన స్వగ్రామమైన ఎస్ఎంపురంలో తరచూ కీలక సమావేశాలు జరుగుతుండేవి. కొత్తపేట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి నారాయణ, మొదలవలస కృష్ణమూర్తిలతోపాటు మరి కొంతమంది స్వాతంత్ర్య సమరంలో కార్యోన్ముఖులయ్యారు. బొంతలకోడూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికులు బాపూజీ దూసి రైల్వే స్టేషన్ వద్ద దిగినప్పుడు ఆయనకు చేనేత వస్త్రాలను బహూకరించారు. చౌదరి సత్యనారాయణ నివసించిన ఇల్లు ఇప్పటికీ గ్రామంలో ఉంది. 1921లో జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు తరగతుల బహిష్కరణ ఉద్యమానికి చౌదరి సత్యనారాయణ నాయకత్వం వహించారు. 1922లో కల్లు వ్యాపారాన్ని వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొన్నారు. 1923లో కళింగపట్నంలో జరిగిన కాంగ్రెస్ సభలో తన సహచరులతో కలిసి పాల్గొన్నారు. 1926లో గాంధీజీ ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన యాత్రకు సత్యనారాయణ హాజరయ్యారు. 1930 ఏప్రిల్ 19న నౌపడలో రామలింగం మాష్టారు నాయకత్వాన ఉప్పు కుప్పల దోపిడీలో చౌదరి పాల్గొన్నారు. 1935-36లో బాబూ రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ జిల్లా పర్యటనతో ఈ ప్రాంతంలో జాతీయోద్యమం ఊపందుకుంది. ఎన్‌జీ రంగా, వీవీ గిరి ప్రేరణతో కిసాన్ ఉద్యమంలో సత్యనారాయణ తన వంతు బాధ్యతను నిర్వర్తించారు.

జెండా పండుగకు వేళాయే

(ఏడో పేజీ తరువాయి)

ఎదురైనా.. అధికారులు వాటిని అధిగమించారు. ఇప్పటికే జిల్లా ఆవిర్భావం సందర్భంగా వజ్రోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆగస్టు 15 అంటేనే.. స్వాతంత్ర్య దినోత్సవం. అదేరోజున శ్రీకాకుళం జిల్లా కూడా ఆవిర్భవించడంతో ఏటా ఈ రోజున రెండు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలల్లో జాతీయ జెండాను మంత్రి అచ్చెన్నాయుడు ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య పోరాట యోధుల కుటుంబాలను సన్మానించనున్నారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 169 మంది ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేస్తారు. 71 ప్రభుత్వ శాఖల నుంచి 163 మంది ఉద్యోగులను, 13 ఎన్జీవోల నుంచి ఆరుగురిని ఉత్తమ ప్రశంసా పత్రాలకు ఎంపిక చేశారు. అలాగే స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా.. హామీలు నెరవేరుస్తున్నాం

(ఏడో పేజీ తరువాయి)

అమలు చేస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో పాటు తాజాగా అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమచేశాం. రైతు బాగుంటేనే.. దేశం బాగుంటుంది. పీ-4 కార్యక్రమంతో పేదలకు అండగా నిలవనున్నాం. డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16,700 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నాం. శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామ'ని తెలిపారు. 'మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పోర్టుకు అనుసంధానంగా పరిశ్రమలు స్థాపించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. దీని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మూలపేట నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు తీరప్రాంతంలో రహదారి నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రెండు నెలల్లో మూలపేట పోర్టుకు తొలిషిప్ వచ్చేలా ప్రయత్నాలు సాగిస్తున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. 'పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచింది. అక్కడి ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకడం హర్షనీయం. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతికహక్కు వైసీపీ అధినేత జగన్‌కు లేద'ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టీడీపీ నేతలు కింజరాపు హరివరప్రసాద్, జీరు భీమారావు, బగాది శేషగిరి, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, బోయిన రమేష్, కర్రి అప్పారావు, పూజారి శైలజ, కూశెట్టి కాంతారావు, రెడ్డి అప్పన్న, మెండ అప్పారావు పాల్గొన్నారు.

ఎనలేని చరిత్ర.. సిక్కోలు ఘనత

(ఏడో పేజీ తరువాయి)

నడిచి 1940లో భారతి పత్రికకు సంపాదకుడిగా పని చేశారు. ఆధునిక జర్నలిజానికి బాటలు వేసిన తాపీ ధర్మారావు స్వస్థలం.. బరంపురం. ఈయన బరంపురం నుంచే 'కాగడా', 'ప్రజామిత్ర' పత్రికకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. 1923లో నరసన్నపేటకు చెందిన పొట్నూరు స్వామిబాబు కళింగ వైశ్యుల్లో ఉన్న మూఢాచారాల నిర్మూలనకు 'వైశ్య' అనే పత్రికను నడిపారు. ఇచ్ఛాపురానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పుల్లెపు శ్యామసుందరరావు ప్రజావాణి పత్రికను నడిపారు.

మాకొద్దీ తెల్లదొరతనం... గరిమెళ్ల సాహిత్యం

మాకొద్దీ తెల్లదొరతనం అన్న స్వాతంత్ర్య సమరయోధుడు, సాహితీ ఉద్యమకర్త గరిమెళ్ల సత్యనారాయణ కూడా ఈ జిల్లా వాసే. 1893లో పోలాకి మండలం ప్రియాగ్రహారంలో జన్మించారు. గాంధీజీ పిలుపుతో జాతీయోద్యమంలో పాల్గొని 162 పదాలతో 'మాకొద్దీ తెల్లదొరతనమూ దేవా! మాకొద్దీ తెల్లదొరతనమూ.. మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే' అనే పాటను రాశారు. ఈ గేయం తెల్లదొరల గుండెల్ని జల్లుమనిపించింది. 'స్వరాజ్య గీతాలు' రాసినందుకు గరిమెళ్లకు బ్రిటీష్ ప్రభుత్వం రాజద్రోహం నేరం కింద రెండేళ్ల జైలు శిక్ష విధించింది. గరిమెళ్ల గేయకవి, నాటకకర్త, సంస్కర్త, అనువాదకుడు. అన్నింటికి మించి ఆదర్శనీయుడు, దేశభక్తి గల భారతీయుడు. వైద్యసౌకర్యం కొరత వల్ల.. తీవ్ర అనారోగ్యంతో 1952 డిసెంబర్ 18న మృతి చెందారు.

● సంస్కృతికి ప్రతీక పొందూరు సన్నఖాదీ..

ఖాదీని గంగా నదిగా భావిస్తే.. పొందూరు ఖాదీని గంగా నదికి జన్మనిచ్చిన గంగోత్రిగా అభివర్ణించవచ్చు అని గాంధీజీ మనుమరాలు తారాగాంధీ అభివర్ణించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఉప్పు, చరఖా, ఖాదీ తెల్లవారి గుండెల్లో దడ పుట్టించాయి. గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్తు బహిష్కరణ, వస్త్ర దహనంలో ఉద్యమం పతాకస్థాయికి చేరుకుని ఖాదీ స్వదేశీ ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఆంధ్ర ప్రాంతంలో అప్పటికే బాగా వాడుకలో ఉన్న సన్న నూలు వస్త్రాలు 1921లో గాంధీజీ దృష్టికి వచ్చాయి. అవి నిజంగా చేతి వడుకు నూలుతో నేసిన వస్త్రాలేనా..? అని గాంధీజి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే ఆయన ఆ వడుకు, నేత విధానాలను పరిశీలించి నివేదికను సమర్పించాలని తన కుమారుడు దేవదాసు గాంధీజీని పురమాయించారు. దేవదాసుగాంధీజీ పొందూరు, అంపోలు, బొంతలకోడూరు తదితర ప్రాంతాల్లోని పర్యటించి.. ఖాదీని పరిశీలించి చేతి వడుకు నూలుతో నేసిన వస్త్రాలేనని గాంధీజీకి చెప్పారంట. ఈ విషయాన్ని బాపూజీ అప్పట్లో 'యంగ్ ఇండియా' పత్రికల్లో ప్రకటించారు. అప్పటి నుంచి శ్రీకాకుళం జిల్లా సన్ననూలు వస్త్రాలకు, పొందూరు ఖాదీ వస్త్రాలకు అఖిల భారత స్థాయిలో ఎనలేని ప్రచారం, ఆదరణ లభించాయి.

● ఉద్యమాల గడ్డ శ్రీకాకుళం..

దేశంలో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక స్థానముంది. నేటి విప్లవ పార్టీలకు జిల్లాతో ఎనలేని సంబంధముంది. దేశ చరిత్రలోనే శ్రీకాకుళోద్యమం కీలకమైనది. 1967లో భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభమైంది. జిల్లాకు చెందిన ఉద్యమకారులంతా గిరిజనులకు బాసటగా నిలిచారు. ఆ తర్వాత నక్సల్‌బరీ ఉద్యమం మొదలైంది. పాతపట్నం, సోంపేట, సారవకోట, పలాస, మందస వంటి ప్రాంతాల్లో ఉద్యమం తీవ్రం దాల్చింది. శ్రీకాకుళం నక్సల్‌బరీ ఉద్యమంలో సుమారు 400 మంది వరకు ప్రాణాలు కోల్పాయారు. సోంపేట బీలలో థర్మల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు రెండున్నరేళ్లుగా ఉద్యమించి.. ముగ్గురు ప్రాణాలు అర్పించారు. వందలాది మంది గాయపడ్డారు. కాకరాపల్లి తంపర భూముల్లో థర్మల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్న జనంపై పోలీసులు కాల్పులు ఘటనలో ఇద్దరు మృతి చెందడంతో మరో ఉద్యమం తీవ్రతరమైంది.

● మల్లువీరుడు.. కోడి రామ్మూర్తినాయుడు

కోడి రామ్మూర్తినాయుడు.. ఈ పేరు తెలియనివారు లేరు. ఆయన స్వయంకృషితో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే ప్రతిభను ప్రదర్శించారు. సాముగరిడీలు, కుస్తీల వంటి స్వదేశీ మెలకువల నుంచి పేర్లర్‌బార్, హారిజాంటల్ బార్, రోమన్‌రాగ్స్ వంటి విదేశీ మెలకువలనూ నేర్చుకున్నా.. ఆయన్ని మహాబలుడిని చేసింది మాత్రం భారతీయ యోగశాస్త్రం. ప్రాణాయామం, జల, వాయు స్తంభన విద్యలను శారీరక బలప్రదర్శలకు జోడించడం వల్లనే ఆయన మల్లువీరుడయ్యారు. ఉక్కు గొలుసులను శరీరానికి చుట్టుకొని, ఊపిరి బిగించి వాటిని పటాపటా తెంచడం, బంపర్లు పట్టుకుని రెండు చేతులతో రెండు కార్లను నిలిపివేయడం, పెద్దబండరాతిని ఛాతిపై ఉంచి సమ్మెట లతో ముక్కలు చేయించుకోవడం, ఛాతిపై చెక్క బల్లను వేయించి దానిపై ఏనుగును ఐదు నిమిషాలు నిలబె ట్టుకోవడం.. రామ్మూర్తినాయుడు సాహస ప్రదర్శనల్లో ప్రధానమైనవి. శ్రీకాకుళంలో రామ్మూర్తినాయుడు స్టేడియం.. బెంగళూరులో రామ్మూర్తినాయుడు స్ట్రీట్, విజయనగరంలో కోడిరామ్మూర్తినాయుడు వ్యాయామశాల... ఇలా కొన్ని ఆయన గుర్తులుగా మిగిలి ఉన్నాయి.

ప్రపంచ క్రీడావనిలో గుబాళించిన తెలుగు మల్లి

అంతర్జాతీయస్థాయిలో అంతంతమాత్రంగా ఉన్న భారత క్రీడా కౌశలాన్ని సమున్నతస్థానానికి తీసుకువెళ్లేందుకు ఓ ధ్రువతారగా వెలిగింది కరణం మల్లీశ్వరి. మహిళలెవ్వరూ ఆసక్తిచూపని దశలో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడలో అసమాన ప్రతిభ కనబరిచి.. ఆమె స్ఫూర్తిగా నిలిచారు. తొలుత గ్రామస్థాయి పోటీల నుంచి ప్రారంభమైన ఆమె జైత్రయాత్ర నిరాటంకంగా కొనసాగింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎన్నో రికార్డులు సాధించిన మల్లీశ్వరి చైనాలోని గ్యాంగ్‌ఝూలో జరిగిన ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని భారత్‌కు మూడు స్వర్ణ పతకాలను తెచ్చిపెట్టారు. ఇప్పటివరకూ 30 అంతర్జాతీయ పతకాలను సాధించిన మల్లీశ్వరికి అర్జున అవార్డు, రాజీవ్ ఖేల్‌రత్న అవార్డులను ప్రభుత్వం అందజేసింది.

నకిలీ దివ్యాంగుల లెక్కతేలింది

● జిల్లాలో 40 శాతం మేర అనర్హులే!

● సచివాలయాల్లో జాబితాలు

నరసన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సకలాంగులను దివ్యాంగులుగా సదరంలో నకిలీ ధ్రువ పత్రాలను గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా జారీ చేశారు. సదరంలో నాయకుల సిఫార్సులతో వైద్యులు ఇష్టానుసారంగా దివ్యాంగుల సర్టిఫికేట్లును జారీ చేశారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం సదరంలో రీవెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. జిల్లాలో ఇటీవల సదరం రీవెరిఫికేషన్ పూర్తి కావడంతో సెర్ప్ అధికారులు సదరంలో అనర్హులుగా తేలిన వారి జాబితాలను సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌కు పంపించారు. ఏ సచివాలయం పరిధిలో ఎంత మంది అనర్హులే.. ఎవెరెవరు అనర్హులు అనే విషయాన్ని పొందుపరిచారు. జిల్లాలో 31,584 మంది దివ్యాంగులు పింఛన్ ప్రతీ నెలా పొందుతున్నారు. వీరిలో సుమారు 40శాతం మేరకు అనర్హులుగా గుర్తించినట్లు సమాచారం. నరసన్నపేట మండలంలో 498 మంది దివ్యాంగులకు 262 మంది అనర్హులుగా నిర్ధారించి సచివాలయాల్లో అనర్హులు జాబితాలను ప్రదర్శించారు. అర్హులైనవారు కూడా అనర్హులుగా గుర్తిస్తే తిరిగి గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకుంటే.. ప్రత్యేక వైద్యులు కమిటీ పరిశీలించి నిర్ధారించేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వనుంది.

సర్దార్ లచ్చన్న పేరు చెరిపేయాలనుకున్నారు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తన తాత, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పేరును చెరిపేసేందుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఎంతో ప్రయత్నించారని, ప్రజల ఆదరాభిమానాలు ఉన్నన్నాళ్లు ఆయన పేరు, ముఖచిత్రాన్ని దూరం చేయలేరని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సర్దార్ లచ్చన జయంతి శనివారం నిర్వహించనున్నట్టు, దీనిని ఏటా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు ఆమె తెలిపారు. ఏ పార్టీకి చెందిన వారైన దేశానికి సేవ చేసిన పెద్దలను గౌరవించడం మన సంప్రదాయమని, 2019 వైసీపీ అధికారంలోకి రాక ముందు వరకూ ఇది కొనసాగింద న్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాత్రం గౌతు లచ్చన్న పేరు చెరిపేయడానికి, తనను ఇబ్బంది పెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశార న్నారు. పలాసలో ఉన్న గౌతు లచ్చన్న విగ్రహం తొలగిస్తానని, ఆయన గురించి, సర్దార్ బిరుదు గురించి నోటికొచ్చినట్టు మాట్లాడిన విధానం ఇప్పటికీ బాధ కలిగిస్తుందన్నారు. అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి సైతం వారించ కుండా అప్పలరాజుకు మరిన్ని పదవులు ఇచ్చి సహకరించారని గుర్తుకు తెచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గౌతు లచ్చన్న ఏ పార్టీ అని చూడకుండా తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. లచ్చన్న జయంతి అధికారంగా చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఉత్సాహంగా గ్రామీణ క్రీడల పోటీలు

(ఏడో పేజీ తరువాయి)

కె.పారయ్య (తృతీయ), జూనియర్ బాలుర విభాగంలో ఎస్.సుమంత్ (ప్రథమ), ఏ.రాజకృష్ణ(ద్వితీయ), ఐ.యశోధర్ (తృతీయ), సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఆర్.నరేంద్రనాయుడు (ప్రథమ), బి.మణి సతీష్ (ద్వితీయ), ఏ.ముకుందరెడ్డి(తృతీయ), సీనియర్ బాలికల విభాగంలో బి.శ్రీలేఖ (ప్రథమ), వి.సాహితి సౌమ్య (ద్వితీయ), బి.భావన సాయి (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు.

● పిల్లి మొగ్గలు బారుల విభాగం పోటీల్లో నరేంద్రనాయుడు ప్రథమ బహుమతి విజేతగా నిలిచాడు.

● ఇసురు గుండు పురుషుల విభాగంలో రామకృష్ణ (ప్రథమ), పి.క్రిష్టారావు (ద్వితీయ), ఏ.త్రినాథరావు (తృతీయ).

● తీత సంగిడి పోటీల్లో పి.క్రిష్ణ (ప్రథమ), జి.రమణ (ద్వితీయ), కె.సత్య (తృతీయ)

● ఈడుపు సంగిడి పోటీల్లో ఏ.త్రినాథరావు(ప్రథమ), టి.రామకృష్ణ(ద్వితీయ), ఎం.రాంబాబు (తృతీయ)

● ఉలవల బస్తా పోటీల్లో టి.రామకృష్ణ(ప్రథమ), ఏ.త్రినాథరావు(ద్వితీయ), పి.కోటేశ్వరరావు (తృతీయ)

● బంపర్లు పోటీల్లో బి.యోగేశ్వరరావు (ప్రథమ), ఏ.త్రినాథరావు (ద్వితీయ), ● గూటాల (ముద్గర) పోటీల్లో వి.జగన్ (ప్రథమ), ఎం.మణికంఠ (ద్వితీయ), బి.సురేష్ (తృతీయ) స్థానం సాధించారు.

నేడు జిల్లా వజ్రోత్సవాల ముగింపు

అరసవల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలతో పాటు జిల్లా వజ్రోత్సవాలు కూడా శుక్రవారంతో ముగియనున్నాయి. ఉత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో జరగనుంది. ఉదయం 9-00 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య వేడుక లు జరుగుతాయి. జిల్లాకు కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చిన ప్రముఖులను సత్కరించనున్నారు.

భూగర్భ జలాల పెంపుపై దృష్టి

● వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు పెంచేందుకు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి సాగునీటి సంఘాలు, జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వెలుగొండ, ఉత్తరాంధ్ర, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. చెరువులు, కాలువలు, చెక్ డ్యామ్‌లను నింపి, వరి, పత్తి, చెరకు వంటి పంటలకు నీరు అందేలా చూడాలని సూచించారు. నీటి నిర్వహణపై జిల్లాల వారీగా రేటింగ్ విధానం అమలు చేసి, పనితీరు మెరుగుపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, వంశధార ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ అరవల రవీంద్ర, నారాయణపురం ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, సాగునీటి అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులకు శిక్షణ



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

అరసవల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్‌లో జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2గా పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల డా.శశిధర్ హాస్పిటల్‌లో డా.వినీష గురువారం సురక్షా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో డ్రగ్ డీ-అడిక్షన్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ మెజర్స్, వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో పాల్గొన్న వారికి డాక్టర్ వినీష, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, ఈఈ సురేష్‌కుమార్‌లు సర్టిఫికెట్లను అందజేశారు.

బాతువ వ్యక్తినే ఛైర్మన్‌గా నియమించండి



నిరసన తెలుపుతున్న బాతువ ప్రజలు

జి.సిగడాం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బాతువ పీఏసీఎస్ ఛైర్మన్ పదవిని స్థానికులకే ఇవ్వాలని నాయకులు, యువకులు గురువారం ఇక్కడి పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పక్క గ్రామమైన గెడ్డకంచరాంకు చెందిన వ్యక్తికి అధ్యక్ష పదవి కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని స్థానికులకు ఛైర్మన్ పదవిని ఇవ్వాలని కోరారు. ఈమేరకు పీఏసీఎస్ కార్యాలయం ముందు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

400 కుటుంబాలకు ఇబ్బంది పెట్టొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సరుబుజ్జిలి నాలుగు రోడ్ల జంక్షన్‌లో 30 సంవత్సరాల నుంచి చిన్నపాటి వ్యాపారాలతో జీవనం సాగిస్తున్న 400 కుటుంబాల ఉపాధిని కొట్టవద్దని వ్యాపారులు స్థానిక తహసీల్దార్‌ను కోరారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా గురువారం పనులు చేపట్టడానికి యంత్రాలు తీసుకురావడంతో వ్యాపారులు తహసీల్దార్ మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు. వ్యాపారాలు చేసుకోవడానికి అనుకూలంగా రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ... చెబుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు స్థలాన్ని గుర్తించినట్టు చెప్పారు. వ్యాపారుల అభ్యర్థనను జిల్లా అధికారులు దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఆర్ఓ ప్లాంట్లు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో గల అన్ని పాఠశాలల్లో ఆర్ఓ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. గురువారం బాలికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఆర్ఓ ప్లాంట్ డోనర్ మాచర్ల వెంకట సత్యనారాయణ మూర్తి, కమిషనర్ ఎన్.రమేష్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, వెంకటేష్, కె.రామకోటి, సభ్యులు ఎం.రాజ్‌కుమార్, పి. దినేష్‌కుమార్, తులసీదాస్, కృష్ణమూర్తి, రామారావు, గోపి, ప్రదీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులకు పింఛన్లు ఇప్పించండి

ఇచ్ఛాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండల పరిధిలో గల అన్ని పంచాయతీలలో దివ్యాంగులకు సంబంధించి రీ వెరిఫికేషన్‌లో నిజమైన అర్హులను అనర్హులుగా ప్రకటించినట్టు జాబితాలు ఉన్నాయని మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు అన్నారు. నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అర్హులందరికీ పింఛన్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి డి.కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్ల సేవలకు ప్రతిఫలం ఇదేనా?

వేతన బకాయిలూ లేవు.. ఉద్యోగాలూ లేవు ● ఇదీ ఉద్దానం పథకం పంప్‌హౌస్ సిబ్బంది దుస్థితి



విప్ అశోక్‌కు సమస్యను వివరిస్తున్న ఉద్దానం సిబ్బంది

కవిటి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వారంతా రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్నారు. వేతనాలు ఆలస్యమవుతూ వచ్చినా పట్టించుకోకుండా ప్రజలకు సేవలు అందిస్తూ వచ్చారు. కానీ కొద్ది రోజుల క్రితం వారంతా ఒకే గూటికి చేరటంతో నెలవారీ వేతనం అందుతోంది. కానీ పాత బకాయిలు చెల్లించటం మరచిపోయారు. దాంతో ఆ సిబ్బంది లబోదిబోమంటున్నారు. అంతేకాకుండా తాజాగా కొంత మందిని విధుల నుంచి తొలగించడం వివాదాస్పదమవుతోంది. ఇదీ ఉద్దానం మంచినీటి పథకంలో పంపుహౌస్‌ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది దుస్థితి. వీరంతా దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ పథకంలో చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలో 132 మంది పనులు చేస్తూ గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చేసేవారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయిలో 9 మంచినీటి పథకాల్లో 51 మందికి వేతనాలు అందించకుండా అధికారులు తాత్సారం చేశారు. దాదాపు రూ.80లక్షల వరకు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఉద్దానం పథకంలో ఏళ్ల తరబడి ఉన్న సిబ్బందిలో వయస్సు దాటిందని కొన్నాళ్ల కిందట 25 మందిని తొలగించారు. మిగిలిన వారిని సుజలధార పథకంలో 4నెలల క్రితం విలీనం చేశారు. వీరికి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా వేతనాలు అందుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. పాత బకాయిలతో తమకు సంబంధం లేదని అంటున్నారు. దీంతో కలెక్టర్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

వాట్సాప్ సందేశంతో తొలగింపు ఉత్తర్వులు

పంపుహౌస్‌ల వద్ద పనులు చేస్తున్న వీరిలో 86 మందిని తొలగిస్తూ తాజాగా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించారు. 'మీ అందరికీ ఈనెల 13వ తేదీ మాత్రమే చివరి పని దినం'గా పేర్కొం టూ వాట్సాప్ సందేశం పంపించటంతో వీరంతా అవాక్కయ్యారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ దృష్టికి గురువారం సిబ్బంది తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు. దశాబ్దాలుగా విధు లు నిర్వ హిస్తున్న తమను అకస్మాత్తుగా తొలగిస్తున్నామని చెప్పటంలో ఆత్మహత్యలే శరణ్యమంటూ తీవ్రంగా రోదిస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే అశోక్ స్పందిస్తూ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.



సిబ్బందిని తొలగిస్తున్నట్టు వాట్సాప్ సందేశం

జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధిని వేగవంతం చేయాలని, అందుకు గాను అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆమె ఆధ్వర్యంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా అధ్యక్షతన జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల వారీగా అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా కవిటి, సోంపేట ప్రాంతాలలో కిడ్నీ రోగులకు డయాలసిస్ సౌకర్యాలు పెంచాలని, దీని కోసం తక్షణ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలన్నారు. పంచాయితీరాజ్ శాఖ కాలం చెల్లిన పనుల జాబితాను సమర్పించాలని, ఉద్దానం పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని కోరారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి, గ్రామాలకు నిరంతర విద్యుత్తు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ఈ సమావేశాల్లో జిల్లా అధికారులు జెడ్పీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న స్టాల్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వజ్రోత్సవాల్లో భాగంగా స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో పలాస నియోజకవర్గ స్టాల్‌ను స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం ప్రారంభించారు. ఇందులో స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, నాటి గుర్తులు, స్థానికంగా లభించే తినుబండారాలు, చేనేత ఉత్పత్తులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వీటిని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఇంటర్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

కంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మందస, ఇచ్ఛాపురం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తేజేశ్వరరావు, శంకరరావు అన్నారు. స్థానిక కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ధర్మారావుకు నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమస్యలు పరిష్కరించండి

కంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ శ్రీనువాసరావు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణం పూర్తి చేయాలని, వసతి సమస్య పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



గారలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఏయూ విద్యార్థులు

గార, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశంలో ఉన్న కోకా వారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. హెచ్ఎం ఆధ్వర్యంలో 75 అడుగుల జాతీయ పతాకాన్ని రూపొందించి గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో....

ఎచ్చెర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో ఆర్వోబీ పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆరు నెలల్లో ఇచ్ఛాపురం రైల్వే నిలయం సమీపంలో ఆర్ఓబీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రైల్వే అధికారులు ఏఎక్స్ఈఎన్ కన్సల్టెంట్ ఆర్ఎస్‌పీ డి.ప్రకాశరావు తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం వచ్చిన రైల్వే అధికారులతో ఆర్డీఓ వెంకటరమణ, ఇంజనీర్లు ఆర్ఓబీ నిర్మాణం చేపట్టనున్న స్థలం మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.70 కోట్లతో రైల్వే ఎల్‌సీ గేటు నుంచి క్వార్టర్ల మీదుగా కొళిగాం రోడ్డు వరకు 500మీటర్ల మేర వంతెన నిర్మించనున్నట్టు తెలిపారు. దీనిని త్వరగా పూర్తి చేసి పరిసర ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు రాజేష్‌కుమార్ గౌడ, సపన కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ కల్తీ చేస్తే బంకులు సీజ్

ఇచ్ఛాపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్‌లలో పెట్రోల్, డీజిల్ వంటివి కల్తీ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు బంక్‌లు సీజ్ చేస్తామని ఆర్డీఓ వెంకటరమణ హెచ్చరించారు. గురువారం పట్టణ పరిధిలో గల బీపీసీఎల్ పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. ఆయిల్ నాణ్యత, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆయిల్ ధరలు బోర్డుపై రాయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో గాంధీ విగ్రహావిష్కరణ

బెల్లుపడ గ్రామం వద్ద గల కేజీబీవీ పాఠశాలలో అలియన్స్ క్లబ్ ప్రతినిధులు గురువారం మహాత్మాగాంధీ, కస్తూర్బాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటరమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ శిరీష, లోపింటి నరసింహమూర్తి పాల్గొన్నారు.

పీఆర్‌సీని నియమించండి

ఆమదాలవలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తక్షణమే 12వ పీఆర్‌సీని నియమించి.. 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారం పట్టణంలోని ఎస్టీవో కార్యాలయం ఆవరణలో జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. సంఘ అధ్యక్షుడు సురవరపు శిమ్మినాయుడు మాట్లాడుతూ పెన్షనర్ల హక్కులను కాలరాస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, ఎస్టీవో బీ.కృష్ణారావు, ఉపాధ్యక్షులు దాస్యం లక్ష్మణరావు, బెండి సూర్యనారాయణ, బొడ్డేపల్లి వెంకటరమణ, కార్యదర్శులు పి.వి.ఎస్. మాస్టార్, పేడాడ భానోజీరావు, కర్నేన జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై విచారణ

పొందూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్. సౌమ్యపై వచ్చిన ఆరోపణలపై ఆర్‌జేడీ నాగమణి గురువారం విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం, ఇతర ఆరోపణలపై ఎస్ఎంసీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లు జిల్లా ఉన్నతాధికారులు, ఎంఎల్‌సీ రవికుమార్‌తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనే అధికారులు విచారణ చేపట్టి.. బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ విచారణ నివేదికను అధికారులకు అందించనున్నట్టు తెలిపారు. ఈ విచారణలో ప్రిన్సిపాల్ లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాత శ్రీకాకుళం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో 40 సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ


బాధితురాలు దాలమ్మ

కోటబొమ్మాళి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం బడే నర్సాపురం గ్రామానికి చెందిన బొమ్మాళి దాలమ్మ మెడలోని రెండు తులాల బంగారం పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. దాలమ్మ ఇంటి సామగ్రి కోసం గురువారం సాయంత్రం కోటబొమ్మాళి బజారుకు వచ్చింది. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్విచక్రవాహనంపై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపుకుని పారిపోయారు. లబోదిబో మంటున్న దాలమ కేకలు అటుగా తన సిబ్బందితో వస్తున్న ఎస్ఐ వంగపండు సత్యనారాయణ విని అక్కడి చేరుకుని విషయం తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దొంగతనానికి యత్నం..


వివరాలు సేకరిస్తున్న పాతపట్నం సీఐ రామారావు

మెళియాపుట్టి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టుపురం గ్రామానికి చెందిన అంబల కాంచన ఇంటిలో గురువారం ఓ దొంగ చొరబడి దొంగతనానికి యత్నించాడు. ఇదే సమయంలో కాంచన రావడంతో ఆమెపై దాడి చేసి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం కాంచన తన ఇంటికి తాళం వేసి సాయిబాబా గుడికి వెళ్లింది. ఆమె భర్త ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తుండంతో డ్యూటీకి వెళ్లిపోయాడు. ఇదే సమయంలో ఓ దొంగ కాంచన ఇంటోకి చొరబడేందుకు ఇంటి తాళం పగలు కొడుతున్నాడు. ఇదే సమయంలో కాంచన రావడాన్ని చూసిన ఆ దొంగ రాయితో ఆమె తలపై కొట్టి పారిపోయాడు. గాయపడిన కాంచనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పాతపట్నం సీఐ రామారావు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

శ్రీకూర్మంలోని యూనియన్ బ్యాంకులో..


గోడకు రంధ్రం చేసిన దుండగలు

గార రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో ఉన్న యూనియన్ బ్యాంకులో చోరీకి బుధవారం అర్ధరాత్రి సమయంలో దుండగులు యత్నించిన ఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. బ్రాంచి మేనేజర్ విధులు నిర్వహిస్తున్న గదికి ఎడమ భాగంలోని గోడ పైభాగంలో రంధ్రం చేసి బ్యాంకులోకి చొరబడి చోరీ చేసేందుకు దుండగులు ప్రయత్నించారు. గోడకు రంధ్రం చేసే సమయంలో వచ్చిన శబ్దాలకు చుట్టుపక్కల ఉన్న వారు చూసి కేకలు వేయడంతో వారు తీసుకొచ్చిన కత్తువ, గునపం అక్కడే విడిచిపెట్టి పరుగులు తీశారు. ఈ విషయాన్ని స్థానికులు బ్రాంచి మేనేజర్ చిన్న రామయ్యకు తెలియజేయగా.. ఆయన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం, సీఐ పైడపు నాయుడు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారుల సేకరించారు.

పొలంలో నీరు కడుతూ.. కుప్పకూలి..

- గుండెపోటుతో రైతు మృతి

లావేరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లావేరుకు చెందిన రైతు ఎచ్చెర్ల గొల్ల (50) గురువారం తన పంట పొలంలో వరి నారుకు నీరు కడుతుండగా హఠాత్తుగా గుండె పోటుకు గురై బట్టిలోనే కుప్పకూలి ప్రాణాలను విడిచాడు. లావేరుకు చెందిన ఈ రైతు తన ఖాళీ సమయంలో రణస్థలం జాతీయ రహదారి పక్కన బస్టాప్ సమీపంలో చెప్పులు కుట్టుకుంటూ ఉండేవాడు. లావేరులో కౌలుకి తీసుకున్న పంట భూమిలో వరి నారుకు నీరు కడదామని వెళ్లాడని.. గుండె పోటుతో తనువు చాలించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు రామకృష్ణ, కుమార్తె స్వరూప ఉన్నారు.

గోపీనగర్ పాఠశాల హెచ్‌ఎం..


స్వప్న (ఫైల్)

ఆమదాలవలస, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గోపీనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.స్వప్న గురువారం గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం విధులకు హాజరైన స్వప్న రాత్రి తీవ్ర గుండెనొప్పితో అనారోగ్యానికి గురికాగా.. కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. స్వప్నకు భర్త నాగరాజుతో పాటు ఒక కుమార్తె ఉన్నారు.

12వ పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలి

కాశీబుగ్గ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు 12వ పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఆప్కాస్ రద్దు చేసి కార్మికులు అందరినీ పర్మినెంట్ చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.బలరాం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి డిమాండ్ చేశారు. గురువారం కాశీబుగ్గ స్థానిక హైస్కూల్ మైదానంలో మంకినమ్మ ఆలయ ఆవరణలో మునిసిపల్ వర్కర్స్‌తో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా గణపతి, అధ్యక్షుడిగా మురుగన్, కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా రవి, సభ్యులను ఎన్నుకున్నారు.

వేడుకల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి


ఆశ్రమ పెద్దలతో మాట్లాడుతున్న కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్

హిరమండలం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కూర్మ వైదిక గ్రామంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో అన్ని జాగ్రత్తలు పాటించాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు ఆశ్రమ నిర్వాహకులకు సూచించారు. గురువారం ఎస్ఐ ఎండీ యాసిన్‌తో కలిసి కూర్మ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ కృష్ణాష్టమి ఏర్పాట్లు పరిశీలించారు. ఇటీవల ఆశ్రమంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వాహనమిత్ర పథకం అమలు చేయాలి

కొత్తూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వ తక్షణమే ఆటోడ్రైవర్లుకు వహన మిత్ర అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్వ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరులో సిఐటియూ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లుతో కలిసి ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం నుంచి తహీసల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనతరం తహసీల్దార్ బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

పలాసరూరల్,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): 2019-24 మధ్యలో నిర్మించిన ఇళ్లను ఈ ఏడాది డిసెబరు 31వతేదీలోగా పూర్తి చేయాలని సోషల్ డెవలెప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్లకు అదనపు సహాయం కింద నగదులు అందజేయడం జరిగిందని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్టు తెలిపారు.

నిద్రమాత్రలు ఇచ్చి.. చంపేశారు

- భర్తను హత్య చేసిన మహిళ
- సహకరించిన ప్రియుడు, మరొకరు
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు

పాతపట్నం ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రియుడి మోజులోపడి ఓ మహిళ భర్తనే హత్య చేసిన ఘటన పాతపట్నంలో చోటుచేసుకుంది. ఈ నెల 7న నమోదైన అనుమానాస్పద కేసును పాతపట్నం పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి, నేరానికి వినియోగించిన నాలుగు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. గురువారం టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈ వివరాలను వెల్లడించారు. నల్లి రాజుకు మౌనికతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. మౌనికకు స్థానిక మాదిగవీధికి చెందిన గుండు ఉదయ్ కుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీంతో రాజు, మౌనిక మధ్య తరచూ తగాదాలు జరుగుతుండేవి. రాజును అంతంచేయాలని, అలాగే మౌనిక ప్రియుడు ఉదయ్ కూడా తన భార్యకు విడాకులిచ్చి ఎక్కడికైనా వెళ్లి వివాహం చేసుకోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. దీంతో రాజును హత్య చేసేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా ఉదయ్ కొత్త ఫోన్ నెంబరుతో రెండు నెలలుగా రాజుతో అమ్మాయిలా మాట్లాడుతూ.. వాట్సాప్‌లో చాటింగ్ చేస్తుండేవాడు. ఏకాంత ప్రదేశానికి రప్పించి రాజును హత్య చేయాలని అనుకున్నాడు. పలుమార్లు ప్రయత్నాలు చేసినా.. రాజు వెళ్లకపోవడంతో వారి పథకం విఫలమైంది. దీంతో ఇంటిలోనే రాజును చంపేందుకు పథకం వేశారు. నిద్ర మాత్రలిచ్చి, మత్తులోకి జారుకున్నాక చంపాలని కుట్ర పన్నారు. ఇందుకోసం ఉదయ్ తనబావ మల్లికార్జున సహాయం కోరాడు. ఉదయ్ పర్లాకిమిడిలో ఒక ఆర్ఎంపీ వైద్యుడి వద్ద నిద్ర మాత్రలు తెచ్చి మౌనికకు ఇచ్చాడు. హత్య జరిగిన ముందురోజు కూడా మౌనిక తనభర్త రాజుకు నాలుగు మాత్రలు అన్నంలో పెట్టి ఇచ్చింది. రాజు పూర్తిస్థాయిలో మత్తులోకి వెళ్లకపోవడంతో.. మరుసటిరోజు 6వ తేదీ రాత్రి ఆరు నిద్ర మాత్రలను అన్నంలో కలిపి రాజుకు ఇచ్చింది. అదితిన్న రాజు గాఢ నిద్రలోకి వెళ్లిపోయాడు. ఇదే అదనుగా ఉదయ్‌కు తన ఇంటికి రమ్మని మౌనిక ఫోన్ చేసింది. ఉదయ్, మల్లికార్జున ముందుగా వీధి లైట్లను ఆపేసి రాత్రి 11.30 గంటల సమయంలో మౌనిక ఇంటికెళ్లారు. మౌనిక, మల్లికార్జున ఇద్దరూ కలిసి రాజు కాళ్లు, చేతులూ పట్టుకోగా.. రాజు ఛాతీపై ఉదయ్ కూర్చొని తలగడతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు.

సినీఫక్కీలో హత్యోదంతం..

హత్యానంతరం రాజు ద్విచక్ర వాహనం, అతడి చెప్పులు, ఒక మద్యం సీసాను తీసుకుని స్థానిక ఎస్సీవీధి దిగువపెట్టి వచ్చారు. ఇటీవలే మద్యం మానేస్తానంటూ రాజు వేసుకున్న కడియాన్ని తీసివేసి అతడి జేబులో పెట్టారు. అలాగే రాజు కట్టుకున్న లుంగీని తీసేసి టీషర్ట్, షార్ట్ తొడిగారు. ఆ తర్వాత తన స్కూటీపై రాజు మృతదేహాన్ని అప్పటికే ఎస్సీ వీధి శివారున ఉంచిన రాజుకు చెందిన వాహనం వద్ద పడేసి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. మరుసటిరోజు ఉదయం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తనభర్త రాత్రి బయటకెళ్లి తిరిగిరాలేదని మౌనిక తన అత్తకు తెలియజేసి.. రాజు మొబైల్‌కు పదేపదే ఫోన్ చేసింది. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పింది. రాజు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అతడి కుటుంబ సభ్యులు తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని రాజు మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మౌనిక ఆసుపత్రికి వచ్చి ఎవరికీ అనుమానం రాకుండా ఏడుపు నటిస్తూ తనభర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా రాజుది హత్యగా నిర్ధారించుకుని పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ విషయం తెలుసుకున్న నిందితులు రెవెన్యూ అధికారి వద్దకు వెళ్లి లొంగిపోయారు. సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, పీసీలు పరమేష్, బి.జీవరత్నం, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కళాశాల డైరెక్టర్

ఆకట్టుకున్న ప్రదర్శనలు

టెక్కలి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం శాక్ ఇన్‌చార్జి కె.సురేష్, వి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతి కళా ప్రదర్శన నిర్వహించారు. గోడపత్రికలు, అల్లిక బహుమానాలు, చేతితో వేసిన బొమ్మలు ఈ ప్రదర్శనలో ఉంచారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డాక్టర్ యుగంధర్, డాక్టర్ శాంతికుమార్ ఉన్నారు.



ఆకట్టుకునేలా..

టెక్కలి, ఆగస్టు 14ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన చిత్రకారుడు కణితి అబ్రహం చేతిలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని దేశభక్తి చిత్రాలను గీశారు. ఇప్పటికే వందలాది చిత్రాలు గీసిన అబ్రహం ఈ తరహా చిత్రాలు గీయడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టర్లకు పాత బిల్లులు చెల్లింపు

- అధికారులతో సమీక్షించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులతో 2018-19 సంవత్సరంలో రోడ్లు, మినీ గోకులాలు, హౌసింగ్, మొక్కలు నాటిన వారికి అప్పటి వైసీపీ ప్రభుత్వం 21శాతం బకాయలను నిలిపివేసింది. దీంతో ప్రస్తుత కూటమి ప్ర భుత్వం బకాయలు విడుదలకు పచ్చజెండా ఊపడంతో గురువారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే గౌతు శిరీష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రహదా రులు వేసిన 62 పనులకు రూ.29 లక్షలు, మినీ గోకులాలకు రూ.3 లక్షలు, హౌసింగ్‌కు సంబంధించి 294 మందికి రూ.6.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. 15 రోజుల్లో సంబంధిత కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉంటే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఎంపీడీవో కె.వసంత్‌కుమార్, డీఎల్‌డీవో ఎన్.రమేష్‌నాయుడు, డీఈఈ రవిబాబు, బి.హరికృష్ణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి


నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిప్రత్యూష

జలుమూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులు వలన సాగునీరు కొరతగా ఉందని, రైతులు సహకరించి పొదుపుగా వాడుకొని శివారు భూములకు అందేలా సహకరించాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అన్నారు. పెద్దదూగాం వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువపై గల 24 నరసన్నపేట బ్రాంచి కాలువను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంశధార ప్రధాన ఎడమ కాలువలో నీటి ప్రవాహం తగ్గి పలాస ప్రాంతం శివారు భూములకు సాగు నీరు అందలేదన్నారు. శివారు భూములకు సాగునీరు అందించేందుకు బ్రాంచి కాలువలకు నీటి ప్రవాహం తగ్గించాలని వంశధార అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభం అయిన తరువాత వర్షాలు పడకపోవడంతో సాగునీటికి ఇబ్బందులు వచ్చాయన్నారు. రైతులు వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనడానికి సాగు నీటిని వృథా చేయకుండా అవసరం మేరకు వాడుకొని మిగతా రైతులకు సాగునీరందేలా సహకరించాలన్నారు. ఈ పరిశీలనలో జలుమూరు, నరసన్నపేట తహసీల్దార్లు జె.రామారావు, సత్యన్నారాయణ, వంశధార జేఈ ఎస్.హరీష్, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

జలుమూరు, (సారవకోట), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోదడ్డపనస కొండపై వెలసిన స్వయంభు అయ్యప్పస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పంచయ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ఉదయం స్వామి వారికి గురుస్వామి సుబ్బారావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర విష్ణుశక్తి అయ్యప్ప హోమాలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్ దర్శించుకొని, ఆలయ అభివృద్ధికి రు.25,000 విరాళంగా అందించారు. కార్యక్రమంలో సారవకోట సొసైటీ అధ్యక్షులు సురవరపు తిరుపతిరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

జాతీయతా భావంపెంపొందించడమే లక్ష్యం

పాతపట్నం ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు పిలుపు నిచ్చారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పాతపట్నం ప్రధాన రహదారిపై గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. స్థానిక కోర్టు కూడలిలోని జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పడాల షన్ముఖరావు, దుక్క శ్రీకాంత్ రెడ్డి, సలాన రాఘవరావు సలాన శరత్ కుమార్, విజయలక్ష్మి, బోయిన శ్రీధర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యారంగ పటిష్ఠతపై ప్రత్యేక దృష్టి

- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పటిష్ఠతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ పథకంలో భాగంగా రూ.6లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్‌ను, ఆధునిక కంప్యూటర్ విభాగాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కూటమి నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనారు. ● పాత బిల్లుల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక కేంపుకార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ● జిల్లా సంస్కృతి, సంప్రదాయాల నిలయం శ్రీకాకుళంఅని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. జిల్లా ఏర్పడి 75వ సంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక నీలమణిదుర్గ ఆలయం వద్ద జిల్లా ఆవిర్భావదినత్సోవాన్ని నిర్వహించారు.

వంశధార నిర్వాసితులపై కేసులు ఎత్తివేయండి


ఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న కలమట

హిరమండలం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వంశధార నిర్వాసితులపై ఉన్న చట్టపరమైన కేసులను ఎత్తివేసేందుకు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు రలమట వెంకట రమణమూర్తి గురువారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. 2017 సంవత్సరంలో వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రామాలు ఖాళీ చేయించడం జరిగిందని కలమట ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమయంలో వివిద కారాణాలు చూపుతూ సుమారు 1500 మందిపై కేసులు నమోదు చేశారని వివరించారు. గవర గోవిందరాలు, పలువురు వంశధార నిర్వాసితులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ సబ్‌యూనిట్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నౌపడా ఆర్ఎస్ దరి ప్రణవి డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ సబ్‌యూనిట్ మంజూరుచేస్తూ ఎన్‌సీసీ యూనిట్ 14 ఆంధ్రా బెటాలియన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు పేడాడ విద్యాసంస్థల ఛైర్మన్ పేడాడ పరమేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ పోస్టర్ ఆవిష్కరణను కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ ఎస్.రమణయ్య, బేక్యాడ్ అడ్మినిస్టేటర్ కె.అప్పారావు, రుక్మంధరరావు, మంజుల, కృష్ణారావు, వెంకటరావు, సరోజిని, శ్రవంతి తదితరులు ఉన్నారు.

రక్షణ గోడ లేక ఇబ్బంది


రక్షణ గోడ లేకపోవడంతో ఇలా...

పాతపట్నం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నౌపడా నుంచి గుణుపూర్ వెళ్లే రైల్వే మార్గంలో వివిధ గ్రామాల వద్ద రక్షణ గోడ లేక తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మండలంలో గల హరిద్వార్ వద్ద సుమారు పది ఆవులు మేస్తుండగా రైలు ఢీకొనడంతో మృతిచెందిన విషయం విదితమే. మండలంలో గల పెద్దలక్ష్మీపురం, పెద్దలోగిడి వంటి గ్రామాల వద్ద రక్షణగోడ లేక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. పెద్దలక్ష్మీపురం గ్రామ సమీపం నుంచే రైల్వేట్రాక్ ఉన్నందువలన గ్రామస్థులు రక్షణగోడ కావాలని విన్నవిస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. టెక్కలి-తెంబూరు రోడ్డుకు రావాలన్నా ఈ రైల్వేట్రాక్ దాటాల్సి వస్తుందని, అధికంగా పిల్లలు కూడా రైల్వే ట్రాక్ పక్కనే ఆటలాడుకోవడం తరచూ కనిపిస్తుంటుంది. రైలు వచ్చే సమయంలో వాళ్లు గమనించకపోతే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి.. రక్షణగోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏపీఎంపై దాడి సరికాదు

నందిగాం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో వెలుగు ఏపీఎం రజనిపై దాడిచేయడాన్ని నందిగాం వెలుగు సిబ్బంది ఖండించారు. ఈ మేరకు గురువారం ఏపీఎం పి.మనోరత్నం ఆధ్వర్యంలో సీసీలు, సీఎఫ్‌లు కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీసీలు గణేష్, కూర్మారావు, భుజంగరావు, షైమావతి, పద్మావతి, అకౌంటెంట్ రజని తదితరులు ఉన్నారు.

108 సేవలపై ఆరా

నందిగాం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 వాహన సేవలపై జిల్లా మేనేజర్ ఎల్.నవీన్ కుమార్ ఆరాతీశారు. ఈ మేరకు గురువారం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కె.చిన్నబాబుతో కలిసి 108 వాహనంలో రికార్డుల్ని పరిశీలించారు. పరికరాలు పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా వాటిపై పూర్తి అవగాహన కలిగివుండాలని సూచించారు. అత్యవసర సేవలు విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. 108 వాహనాలను భవ్య హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మారడంతో వాటిపై దృష్టి పెట్టారు. ఈఎన్‌టీ బి.రాము, పైలెట్ రాజేష్ ఉన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా ప్రశాంత్


ప్రశాంత్

మెళియాపుట్టి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రట్టి గ్రామానికి చెందిన చింతల ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. జనసేన పార్టీకి చెందిన ప్రశాంత్‌ను డైరెక్టర్‌గా నియమించడంపై దూక బాలరాజు, సోమలాపురం చంటి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు దాతల వితరణ

నరసన్నపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వితరణ చేసేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉకలాం ఉన్నత పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు వి.శ్రావణి, కె.దివాకర్ రూ.20వేలు విలువ చేసే క్రీడా దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. రావులవలస పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ శిమ్మ భీమారావు విద్యార్థులకు గుర్తింపు కార్డులు, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, లక్ష్మీనారాయణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

జలుమూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వమిత్ర సర్వేను వేగవంతం చేయాలని శ్రీకాకుళం డీఎల్పీవో ఎల్.గోపీబాల ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న స్వమిత్ర సర్వేను పారదర్శకంగా చేపట్టి అక్టోబరు నెలాకరుకు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

టెక్కలి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామసుందరస్వామి ఆలయంలో ఈనెల 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు అర్చకులు పద్మనాభ పండా తెలిపారు. ఉదయం 5గంటలకు స్వామివారి నక్షత్ర హారతులతో పాటు ఉంజల్ సేవ, ఉట్టికొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

50 కుర్చీల వితరణ

మెళియాపుట్టి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నరిసింగపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామ సేవాసంఘం సభ్యులు రూ.15వేలు విలువగల 50 కుర్చీలను పాఠశాల హెచ్‌ఎం గణపతిరావుకు గురువారం అందజేశారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతితో పాటు వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్నట్టు ప్రతినిధులు ఎన్ని షన్ముఖరావు, దారపు ధర్మారావు, పొట్నూరు శంకరరావు,సంతోష్ తెలిపారు.

సర్దార్ లచ్చన్న జయంతి రేపు

పలాస రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కిష్టపురం గ్రామంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న జయంతి శని వారం ఆయన విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పలాస రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పూర్ణభద్ర గ్రామానికి చెందిన టొంప బుద్దయ్య అనారోగ్యంనకు గురికావడంతో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ గురువారం ఆయనను పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని కోరారు.

వాటర్ ప్యూరిఫైడ్ వితరణ

జలుమూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన సంపతిరావు నాగరాజు రూ.40 వేలు విలువచేసే వాటర్ ప్యూరిఫైడ్ వితరణగా అందించారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలాదేవికి అందించారు. విద్యార్థులకు తాగునీటికి ఇది ఉపయోగ పడుతుందని హెచ్‌ఎం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం, వితరణగా పరికరాలు అందించడం పట్ల పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు చల్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.